క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఎం.వెంకటేశ్వర్లు– నీరజ(వావిలేరు) దంపతులు వ్యవహరించారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎన్‌ఎం

పొదలకూరు : జాతీయ పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా మహ్మదాపురం సెక్టార్ పరిధిలోని వెలికంటిపాళెం ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ఆవశ్యకతపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు పాలు, గుడ్లను ఇళ్లకు పంపుతామన్నారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం, పప్పు, పాలను ప్రతినిత్యం అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనసూయమ్మ, ఆశావర్కర్ పెంచలమ్మ, అంగన్‌వాడీ టీచర్ సుమ పాల్గొన్నారు.

వేధింపులపై మహిళ ఫిర్యాదు

నెల్లూరు సిటీ: సోషల్ మీడియాలో ఓ వ్యక్తి వివాహేతర సంబంధాలపై తనను వేధిస్తున్నారంటూ బోగోలుకు చెందిన ప్రభావతి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల లక్ష్మికి శనివారం నెల్లూరులోని ఆర్‌అండ్‌బీగెస్ట్ హౌస్‌లో వినతిపత్రం అందించింది. తాను కావలి నియోజకవర్గంలో ఐదున్నరేళ్లుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు పేర్కొంది. హరీష్‌రెడ్డి కొంత మంది ఆకతాయిలతో కలిసి సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా తనపై పోస్టులు పెడుతున్నాడని, పలుమార్లు అదే సోషల్ మీడియా వేదికగా ప్రతిఘటించినట్లు తెలిపింది. తాను రాసే వార్తలతో అక్కసు పెంచుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపింది. అక్రమ సంబంధాలు అంటగడుతున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు ఇస్తే స్పందించకపోగా, తనపై అక్రమ కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నట్లు ఆమె ఆరోపించింది. పిన్ని బోయిన చరిత్‌కుమార్, చిలకపాటి మనోహర్, చిలకపాటి మధు కూడా తనను వేధించిన వారిలో ఉన్నారంటూ ఫిర్యాదులో పేర్కొంది.

ప్రాణాలు నిలపడంలో ప్రథమ చికిత్స కీలకం

నెల్లూరు(అర్బన్): అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడడంలో ప్రథమచికిత్స కీలకమని పల్మనాలజిస్ట్ డాక్టర్ కళ్యాణి అన్నారు. పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని (ఫస్ట్‌ఎయిడ్ డే) శనివారం నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవత్స చెస్ట్ క్లినిక్‌లో నిర్వహించారు. డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ క్లిష్ట సమయంలో గ్రామీణ ప్రాథమిక వైద్యులు చేసే చిన్న చికిత్సతో వారి ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ కె.చిరంజీవి మాట్లాడుతూ తీవ్ర అస్వస్థకు గురైన వారిని కాపాడడంలో తొలి చికిత్స విధానాలు వివరించారు. డాక్టర్లను పీహెచ్‌పీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శేషయ్య, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, రామదాసు, పెంచలయ్య, శంకరరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతిపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: నగరంలోని జీజీహెచ్ ప్రాంగణంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్నపిల్లల ప్రసూతి విభాగం పేషెంట్ అటెండర్లు విశ్రాంతి తీసుకునే రేకుల షెడ్డులో ఈ నెల 11వ తేదీ రాత్రి గుర్తుతెలియని (60) వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడంలో సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆస్పత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అతని వద్ద ఎలాంటా లభించలేదు. ఆ వృద్ధుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే 0861–2328440, 94407 00018 నంబర్లలకు తెలపాలని సీఐ రోశయ్య తెలిపారు.

దిగుబడి తగ్గినా.. ధరలు అంతంతమాత్రమే

- మండలంలో 1,400 ఎకరాల్లో వరిసాగు
- పుట్టి ఒక్కటింటికి రూ.17,500
- గతేడాదితో పోలిస్తే తగ్గిన ధరలు



తాటిపర్తి గ్రామం వద్ద రోడ్లపైనే ధాన్యాన్ని తూకం వేస్తున్న మిల్లర్లు

పొదలకూరు : జిల్లాలో ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి వల్ల రైతులు ఆర్థిక స్వావలంబన పొందే అవకాశం ఉంది. అయితే ఎడగారులో ధాన్యం దిగుబడులు తగ్గుతున్నాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తున్నా మధ్యలో దళారులు రైతులను తరుగు పేరుతో కొంత ఇబ్బంది పెడుతున్నారు. ఎర్లీ ఖరీఫ్‌లో ప్రభుత్వం ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకే అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని చెబుతున్నా ధాన్యం నాణ్యతలో కొర్రీలు పెట్టి దళారులు ధరలు తగ్గిస్తున్నట్లుగా తెలుస్తోంది. తేమ శాతం అధికంగా ఉందని బస్తాకు రెండు, మూడు కిలోల ధాన్యాన్ని తరుగు కింద తొలగిస్తున్నారు. ఫలితంగా 850 కిలోల వంతున పుట్టికి 800 నుంచి 790 కిలోలకే నగదు చెల్లిస్తున్నారు. అపరాల సాగు బాగా తగ్గిన తర్వాత నీటి వసతి ఉన్న మండలాల్లో రైతులు వరి సాగునే చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం, జాఫర్‌ఖాన్‌పేట, కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం కనుగొన్న కేఎస్‌ఎం–1638 వరి వంగడాన్ని జిల్లాలో అత్యధికంగా సాగు చేసి గిట్టుబాటు ధరలు పొందేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

గతం కంటే తక్కువ

రైతులు పండించిన వరిధాన్యం గతేడాదితో పోల్చి చూస్తే ప్రస్తుతం ధరలు తక్కువగానే ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో అన్నిరకాల వంగడాలకు రూ.19,500 నుంచి రూ.18 వేలు మధ్య ఉంది. అయితే ప్రస్తుతం అన్నిరకాల వరి వంగడాలకు దళారులు వివిధ కారణాలు చూపి తక్కువకు అడుగుతున్నారు. రైతులు కూడా చేసేది లేక తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. మండలంలోని తాటిపర్తి, విరువూరు, సూరాయపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లి, మహ్మదాపురం గ్రామాల్లో ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. గతేడాది 2,500 ఎకరాల్లో వరిసాగు చేస్తే ఈ ఏడాది కేవలం 1,400 ఎకరాల్లో మాత్రమే వరిపండించారు.

గతేడాది	
వరి రకం	పుట్టి ధర
కేఎస్‌ఎం–733	రూ.19,500
కేఎస్‌ఎం–1638	రూ.19,000
ఎంటీయూ–1010	రూ.18,000
ఎన్‌ఎల్‌ఆర్–34449	రూ.17,000
ప్రస్తుతం	
కేఎస్‌ఎం 733	రూ.17,500
కేఎస్‌ఎం 1638	రూ.17,500
ఎంటీయూ 1010	రూ.17,000
ఆర్ఎన్‌ఆర్ 15048	రూ.17,500

గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయ్



ఎర్లీ ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. మిల్లర్లు, దళారులు గిట్టుబాటు ధరల కంటే అదనంగా చెల్లిస్తున్నందున ఇబ్బందులు తలెత్తడం లేదు. ఖరీఫ్ వరి సాగులో దిగుబడి తగ్గుతుంది. ఎకరాకు 3 పుట్లకు మించి దిగుబడి ఉండదు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

ఉపాధ్యాయుడికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ అందుకున్నారు. తిరుపతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. ఆ క్రమంలో ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నంతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

శ్రీవెంకటేశ్వరలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్యామల ప్రసన్నారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ షీబా కౌసర్ సంయుక్తంగా రాసిన 'వ్యాధుల సామాజిక కారణాలు–నియంత్రణ' అనే పుస్తకాన్ని ఆ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. దీనిని వెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో కొన్ని నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడం, మందుల వాడకం తగ్గించడం లాంటి విషయాలపై రచించిన పుస్తకం సమాజానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మనుబోలు : ఇతర దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన వారు 36 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. వారి ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులకు మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983–88 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీక కలయిక శనివారం జరిగింది. మూడు నెలల ముందే వాట్సప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం చేరవేయడంతో పూర్వ విద్యార్థులైన కమలాకర్‌రెడ్డి, మంజూష, శ్రీలక్ష్మి అమెరికా నుంచి వచ్చారు. అలాగే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పూణె తదితర నగరాల్లో ఉన్న వాళ్లందరూ హాజరయ్యారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ ఆట పాటలతో సందడి చేశారు. అప్పటి పాఠశాల హెచ్‌ఎం గోపాలన్ దంపతులను, తెలుగు పండిట్ రామాంజనేయులు, మ్యాథ్స్ టీచర్ మల్లికార్జునరావు తదితరులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తాము చదివిన పాఠశాలకు గుర్తుగా రూ.25 వేల విలువైన ప్రింటర్ స్కానర్‌ను అందజేశారు. అనంతరం చమర్చిన కళ్లతో ఒకరికొకరు వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమాలను సుధాకర్, పద్మనాభరెడ్డి, ధనుంజయరెడ్డి పర్యవేక్షించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో జీవించాలి



జైలు అధికారులతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

వెంకటాచలం: ఖైదీలందరూ జైలులో పరివర్తన చెంది సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారంలో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. వంటగది, స్టోర్ రూం, ఇతర వసతులను పరిశీలించి, మహిళా ఖైదీలతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కారాగారంలో మహిళా ఖైదీలకు సౌకర్యాలపై జైలు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జైళ్లలో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. జైళ్లల్లో తాము పరిశీలించిన అంశాలపై మహిళా కమిషన్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. మహిళా ఖైదీలు జైలు నుంచి విడుదలైన తరువాత సమాజంలో అందరితో కలిసి మెలిసి సంతోషంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ వసంత బాల, లీగల్ అడ్వైజర్ పూజిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఆదర్శప్రాయుడు డాక్టర్ నరసింహశాస్త్రి



నెల్లూరు (అర్బన్): ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ పీవీ నరసింహశాస్త్రి ఆదర్శప్రాయుడని వీఆర్‌సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ వైస్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. నగరంలోని వీఆర్‌సీ గ్రౌండ్‌లో క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ నరసింహశాస్త్రిని శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ నరసింహశాస్త్రి కుటుంబమంతా సేవా తత్పరులేనన్నారు. వారి తండ్రి డాక్టర్ మధుసూదనశాస్త్రి ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటూ ఎంతో మంది పేదలకు ఉచిత వైద్య సేవలు, ఆపరేషన్లు చేశాడన్నారు. అతి తక్కువ ఫీజుతో ప్రజలకు వైద్యసేవలందించారన్నారు. అదే స్ఫూర్తితో కుమారుడు పేరు తెచ్చుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి, క్లబ్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది నన్నే సాహెబ్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ సులోచనమ్మ, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, నాయకులు జీఎస్ ప్రసాద్, ఆజాద్ జాకీర్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ టీచర్లను సన్మానిస్తున్న విద్యార్థినులు

పొదలకూరు : పట్టణంలోని విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్లో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జి.కామాక్షి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒక భాష ఉండడం అవసరమని, అందుకే హిందీని జాతీయ భాషగా గుర్తించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14వ తేదీన హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయినులైన ఎ.ఇందిర, ఎస్‌కే రేష్మాలను విద్యార్థినులతో కలిసి సన్మానించారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



హర్షవర్ధన్ (ఫైల్)

నెల్లూరు సిటీ: తనతో పాటు వచ్చిన 12 ఏళ్ల కుమారుడు అదృశ్యమయ్యాడని తండ్రి హజరత్తయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఆత్మకూరు మండలంలోని గాండ్లవీడుకు చెందిన హజరత్తయ్య కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరుకు వచ్చారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో కనపడకుండా పోవడంతో తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొప్పనేతను కోల్పోవడం బాధాకరం



కొడవలూరు: నార్తురాజుపాళెంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



ముత్తుకూరు : రావిఆకుపై సీతారాం ఏచూరి చిత్రం

కొడవలూరు : దేశంలో నిస్వార్థ రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప నేత సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో జన్మించిన ఏచూరి సామాన్య జీవితం గడిపారన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం కోసం నిరంతరం పరితపించేవారని చెప్పారు. దేశంలో సీపీఎం పార్టీకి ఆశించిన మేర బలం లేకపోయినప్పటికీ ఏచూరి మేధస్సుతో ఆ పార్టీకి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తలారి నరసింహం, దేవానంద్, ఎస్కే.బాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఏచూరి'కి లాల్ సలామ్

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీలో ఉన్న సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్, సూక్ష్మ కళాకారుడు సోమా పద్మారత్నం రావి ఆకుపై కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన తెలుగు వెలుగుకి ఈ చిత్రం ద్వారా లాల్ సలామ్ చెప్పారు.

వైభవంగా గ్రామోత్సవాలు



మనుబోలు: విద్యుద్దీపాల వెలుగులో బొజ్జ గణపయ్య



మనుబోలు: పడమటి వీధి వినాయకుని గ్రామోత్సవం

మనుబోలు : వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రమైన మనుబోలులో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించి నిమజ్జనం చేస్తున్నారు. పిడూరురోడ్డులోని సాయిబాబా ఆలయం, పడమటి వీధి, కోదండరామపురంలోని గణేశ్ మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు శుక్రవారం రాత్రి వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించారు. సాయిబాబా ఆలయం వద్ద అర్చకుడు శ్రీనివాసులు ప్రత్యేక పూజల అనంతరం గణేశ్ లడ్డూకు వేలం నిర్వహించగా అన్నాబత్తిన సురేష్‌గౌడ్ రూ.1,01,111లకు దక్కించుకున్నారు. వినాయకుని మెడలో వేసిన నగదు మాలను వేలం వేయగా రూ.60 వేలకు గుర్రం తరుణ్ దక్కించుకున్నారు. అలాగే వినాయకుని వద్ద ఉంచిన వెండి కాయిన్‌ను రూ.42 వేలకు మద్దాల చరణ్‌రాజ్ దక్కించుకున్నారు. పడమటి వీధిలో వినాయకునికి అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ ప్రత్యేక పూజలు చేసి లడ్డూను వేలం వేయగా రూ.11 వేలకు పాశెపు రవి దక్కించుకున్నారు. గ్రామోత్సవాల వెంట డీజే, తీన్మార్ బ్యాండ్, మంగళవాయిద్యాలతో యువత సందడి చేశారు. ఉత్సవం అనంతరం గణనాథుని విగ్రహాలను గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

– ముత్తుకూరు : వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. మేళతాళాల మధ్య బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకొంటూ ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను నిమజ్జనం చేసే నిమిత్తం కృష్ణపట్నం సముద్ర తీరానికి తరలించారు. ముత్తుకూరులోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నారికేళపల్లి, బ్రహ్మదేవి, పిడతాపోలూరు, వల్లూరు పంచాయతీల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తరలించారు.



ముత్తుకూరు : నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

నేలటూరులో పశువైద్య శిబిరం



రైతులకు మందుల పంపిణీ

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. హీఫర్ ఇంటర్నేషనల్–ఎస్ఈఐఎల్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆరోగ్య పరీక్షలు జరిపి, 412 పెద్ద పశువులు, 137 సన్నజీవాలు, 1,321 కోళ్లకు మినరల్ మిక్చర్, కాల్షియం, లివర్ టానిక్స్, నట్టల నివారణ మందులు అందజేశారు. నెల్లూరు డివిజన్ వెటర్నరీ ఉపసంచాలకులు డాక్టర్ నాగమణి, ముత్తుకూరు సహాయ సంచాలకులు డాక్టర్ నిర్మల, పశువైద్యులు గోవర్ధన్, రాజ్యలక్ష్మి, సరిత, శివశంకర్‌రెడ్డి, 51 మంది రైతులు పాల్గొన్నారు.